

ఉరకలేస్తున్న పొల్లూరు

మన్యంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో పొల్లూరు జలపాతం కళకళలాడుతోంది. దీంతో తెలుగు రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో పర్యాటకులు ఆదివారం కుటుంబ సమేతంగా తరలివచ్చారు. సందర్శకులు చిన్నారులు, వృద్ధులను రిసార్టుల్లో ఉంచి యువతీ, యువకులు పర్యాటక ప్రాంతాలను వర్షంలో తడుస్తూ తిలకించారు. ఇరుముడి సినిమా చిత్రీకరణకు నిర్మించిన చెక్కల వంతెనపై నుంచి జలపాత అందాలను సెల్‌ఫోన్లో బంధించారు. – న్యూస్‌టుడే, మోతుగూడెం

ఓనం.. సందడి

తాళ్లపూడి: భిన్నత్వంలో ఏకత్వం అనే భారతీయ సంస్కృతి గొప్పదనాన్ని చాటిచెప్పేలా ఓనం పండగ వంటి కార్యక్రమాలు దోహదపడతాయని కొవ్వూరు హోలీ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ నెల్సన్‌ఆంటోని అన్నారు. తూర్పుగోదావరి జిల్లా తాళ్లపూడిలోని మాంటిస్సోరీ పాఠశాల ప్రాంగణంలో కేరళైట్స్ స్కూల్ ఇన్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఆదివారం ఓనం వేడుకలు నిర్వహించారు. మాంటిస్సోరీ పాఠశాల కరస్పాండెంట్ అనీష్ జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పూలతో తీర్చిదిద్దిన అలంకరణ ఆకట్టుకుంది.



అధికారుల నిర్లక్ష్యం.. గ్రామస్థుల గగ్గోలు

గ్రామసభల్లో ఎంపికైన పీడీఎఫ్ పేర్లు ప్రస్తుతం మాయం

చింతూరు, న్యూస్‌టుడే: పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు రాష్ట్ర ప్రభుత్వం అన్నిరకాలుగా పరిహారం అందిస్తూ వస్తున్నా.. దీనికోసం పనిచేస్తున్న అధికారుల్లో నిర్లక్ష్యంతో వారంతా అన్యాయానికి గురవుతున్నారు. 2022లో గోదావరి, శబరి నదులకు వచ్చిన వరదలతో విలీన మండలాల్లో 32 గ్రామాలను వరదల ఆధారంగా పోలవరం పరిహారం చెల్లింపు గ్రామాలుగా ఎంపిక చేశారు. వీటికి పరిహారం అందించే విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. తాజాగా మల్లెతోటలో 148 మంది పీడీఎఫ్ జాబితాలో పేర్లు లేకుండా పోయాయని గ్రామస్థులు గగ్గోలు పెడుతున్నారు.



జాబితాలను సరిచూసుకుంటున్న మల్లెతోట గ్రామస్థులు

ఎందుకు తొలగించారో తెలియక ఆందోళన...

2020లో ఎంపిక చేసిన గ్రామాల్లో ఒకటైన మల్లెతోటకు పరిహారం అందించేందుకు తయారుచేసిన జాబితాలో ఆ గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో అప్పటి ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి అపూర్వభరత్ సమక్షంలో ప్రకటించిన పీడీఎఫ్ పేర్లు తాజాగా విడుదల చేసిన జాబితాల్లో లేకపోవడంతో గ్రామస్థులు మల్లాగుల్లాలు పడుతున్నారు. తొలుత జాబితాల్లో ప్రకటించిన పేర్లు ఇప్పుడు లేకపోవడంతో ఎందుకు తొలగించారో తెలియక ఆందోళన చెందుతున్నారు.

- 2023లో జరిగిన గ్రామసభలో అర్హులైన పీడీఎఫ్‌ల సంఖ్య: 412
- తాజాగా అధికారులు ప్రకటించిన జాబితాలో ఉన్న సంఖ్య: 264
- తొలగిన పీడీఎఫ్‌లు: 148
- 18 ఏళ్లు నిండిన వారు: 76 మంది



ఈయన పేరు **గొర్రె మల్లయ్య.** మల్లెతోట గ్రామానికి చెందిన వ్యక్తి. 2023లో నిర్వహించిన గ్రామసభలో పీడీఎఫ్ జాబితాలో పేరును అప్పటి అధికారులు చదివారు. ప్రస్తుతం అధికారులు విడుదల చేసిన జాబితాలో ఈయన పేరు లేదు. పేరు లేకపోవడానికి కారణాలు తెలియరాలేదు. ఊరు పుట్టినప్పటి నుంచి ఇక్కడే పుట్టి పెరిగిన వ్యక్తి పేరుని జాబితాల్లో ఎందుకు తొలగించారో తెలియని పరిస్థితి.



ఈమె పేరు **కాకా చిన్నక్క.** మల్లెతోటకు చెందిన ఈమె పేరు పీడీఎఫ్ జాబితాలో లేదు. ఇక్కడే పుట్టి పెరిగిన నాపేరు జాబితాలో ఏమైందని గ్రామస్థులు ఏర్పాటు చేసుకున్న సమావేశంలో విషయాన్ని తెలియజేసింది.

మన్యంలో చాయ్‌రాస్తా..

జిల్లాలో నాలుగు చోట్ల స్టాల్స్ ఏర్పాటు

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: మహిళల జీవనోపాధిని మెరుగుపరిచేందుకు కూటమి ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుంది. 'ఒక కుటుంబం - ఒక వ్యాపారవేత్త' నినాదంతో ముందుకు సాగుతున్న కూటమి ప్రభుత్వం ఆ దిశగా మరిన్ని చర్యలు తీసుకుంటోంది. ప్రతి మహిళను ఓ వ్యాపార వేత్తగా తీర్చిదిద్దాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు సంకల్పానికి అనుగుణంగా ఆయా రంగాల్లో అనుభవం ఉన్న సంస్థలతో డీఆర్‌డీఏ-సెర్ప్ రాష్ట్ర స్థాయిలో ఓ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. వాటితో ఔత్సాహిక మహిళా వ్యాపారవేత్తలకు సూచనలు, మెలకువలు ఇప్పించనుంది. అందులో భాగంగానే జిల్లాలో తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం పొందేలా 'చాయ్ రాస్తా' పేరుతో టీ స్టాల్ ఏర్పాటు చేసుకుని ఉపాధి పొందేలా మహిళా సభ్యుల ఎంపిక ప్రక్రియ కొనసాగుతోంది.



రాయితీతో వెసులుబాటు

డీఆర్‌డీఏ ద్వారా స్త్రీ నిధి, ఉన్నతి, బ్యాంకు లింకేజీల ద్వారా రూ.4 లక్షల వరకు రుణం అందిస్తారు. ప్రధాన మంత్రి ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ ప్రోగ్రాం కింద రూ.4 లక్షల రుణం పొందితే రూ.1.40 లక్షలు రాయితీ పొందే వెసులుబాటు ఉంది. రోజూ 5 వేల వ్యాపారం జరిగితే నెలకు రూ.40 వేలు, రూ. పదివేలు జరిగితే రూ.లక్ష 20 వేలు జరిగితే నెలకు రూ.2.50 లక్షల ఆదాయం పొందుతారన్నది అంచనా.

ఫ్రాంఛైజ్ తీసుకుంటే..

సెర్ప్ కుదుర్చుకున్న ఒప్పందం మేరకు చాయ్ రాస్తా బ్రాండ్‌తో టీ స్టాల్ ఏర్పాటుకు ఫ్రాంఛైజ్ తీసుకుంటే కంటైనర్, సామగ్రి అందిస్తారు. టీ, కాఫీ, పంచదార, పాలతో పాటు పలు రకాల బిస్కెట్లు, ప్రముఖ కంపెనీల శీతల పానీయాలు విక్రయించేలా సరఫరా చేస్తారు. లొకేషన్ సర్వే, డాక్యుమెంటేషన్, లైసెన్సులు, మార్కెటింగ్, వ్యాపార శిక్షణలో ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి సహకరిస్తారు.

ఎక్కడెక్కడంటే

జిల్లాలో ప్రధానంగా టోల్‌గేట్లు, జాతీయ రహదారులు, రద్దీ ప్రదేశాల్లో చాయ్‌రాస్తాలు పెట్టేందుకు ప్రాధాన్యం ఇచ్చారు. రాజవొమ్మంగి, అడ్డతీగల, చింతూరు, కూనవరం ప్రాంతాల్లో ఏర్పాటుచేయనున్నారు. రానున్న రోజుల్లో మరిన్ని ప్రాంతాల్లో నెలకొల్పేందుకు సర్వే చేస్తున్నట్లు **డీఆర్‌డీఏ పీడీ దాసరి రత్నాకర్** తెలిపారు.



నేడు ఐటీడీఏలో పీజీఆర్ఎస్

రంపచోడవరం, న్యూస్‌టుడే: రంపచోడవరం ఐటీడీఏ సమావేశమందిరంలో సోమవారం ఉదయం 10గంటలకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ దినేష్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో గిరిజనుల సమస్యలపై వినతులు స్వీకరిస్తామన్నారు. రెవెన్యూ క్లినిక్‌ను కూడా నిర్వహించి భూములకు సంబంధించిన సమస్యలపై వినతులు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా వాసులంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కడియపులంక నర్సరీ సంఘ అధ్యక్షుడిగా సుబ్బారాయుడు

కడియం: కడియపులంక సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. అధ్యక్ష పదవికి బొరుసు సుబ్బారాయుడు, రత్నం అయ్యప్ప అభ్యర్థులు పోటీపడ్డారు. 1,621 ఓట్లు పోలయ్యాయి. సుబ్బారాయుడుకు 985 ఓట్లు, రత్నం అయ్యప్పకు 629 ఓట్లు వచ్చాయి. 356 ఓట్ల ఆధిక్యంతో సుబ్బారాయుడు నూతన అధ్యక్షుడిగా గెలుపొందారు. ఏడు ఓట్లు చెల్లనివిగా తేల్చారు. దూలం సత్యనారాయణమూర్తి 85 ఓట్లు, పుల్లా శ్రీను 96 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. ఏకగ్రీవమైన వార్డు సభ్యులు కామిశెట్టి వెంకటేశ్, ఉండమట్ల అర్జున్, గట్టా కృష్ణ భగవాన్, సానా పల్లపురాజు, డేగల రాము, బోడపాటి చంద్రశేఖర్, పాటంశెట్టి శ్రీనివాస్, తాడాల సత్యనారాయణ, అన్నందేవుల వెంకటేశ్వరరావు (బాబు)తో నూతన పాలకవర్గం కొలువుదీరింది.

చిలుకల కనువిందు



గుంపులుగా వచ్చిన రామచిలుకలు

కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం కోరింగ పంచాయతీ పరిధిలోని చినబొడ్డు వెంకటాయపాలెం జగనన్న కాలనీలోని ఆటోడ్రైవర్ వాడ్రేవు బాలకృష్ణ ఇల్లు చిలుకలకు ఆహార కేంద్రంగా మారింది. ఆయన ఏడాది క్రితం తన ఇంటిపై పిచ్చుకల కోసమని ధాన్యం కుచ్చు కట్టారు. కాని అవి రాలేదు. కొద్ది రోజులకు రెండు రామచిలుకలు వచ్చి చేరాయి. నిత్యం ఆహారం అందుబాటులో ఉంచడంతో పదులు.. వందల సంఖ్యకు చేరాయి. బాలకృష్ణతోపాటు ఆయన భార్య, ఇద్దరు పిల్లలు రోజూ ఉదయం 6 నుంచి 8 గంటల మధ్య, సాయంత్రం 6 గంటలకు ఇంటిపై ఆహారం సిద్ధం చేస్తారు. తొలుత 5 కేజీల ధాన్యం గింజలను ఆహారంగా పెట్టేవారమని, ప్రస్తుతం 20 కేజీలు అవసరం అవుతున్నాయన్నారు. ఆటో ద్వారా నెలకు వచ్చే రూ.12వేల ఆదాయంలో వీటి ఆహారానికి రూ.6వేలు వెచ్చిస్తున్నానన్నారు. మిగతా ధాన్యం గింజలను కొందరు పక్షి ప్రేమికులు కొనుగోలు చేసి ఇస్తున్నారని చెప్పారు. భార్య, పిల్లలు సహకారంతోనే ఈ పని చేయగలుగుతున్నానని ఆయన చెప్పారు. – న్యూస్‌టుడే, తాళ్లరేవు

తిరుమల తరహాలో వాడపల్లి క్షేత్రం అభివృద్ధి

కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ

ఆత్రేయపురం: వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని తిరుమల తరహాలో అభివృద్ధి చేయడానికి కృషి చేస్తామని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. ఆదివారం ఆలయ ప్రాంగణంలో శ్రీవకుళమాత అన్నదాన భవన ప్రారంభోత్సవానికి వచ్చిన ఆయన మాట్లాడారు. ఒకేసారి 3వేల మందికి భోజనాలు, రోజుకు సుమారు 40వేల మందికి ప్రసాదం సిద్ధం చేసేలా సౌకర్యాలు కల్పించడం అభినందనీయమన్నారు. ☛ ఎమ్మెల్యే బండారు మాట్లాడుతూ.. ఆలయానికి సునాయసంగా చేరుకునేందుకు రూ.8 కోట్లతో రావులపాలెం నుంచి ఏటిగట్టు రహదారి అభివృద్ధి చేయనున్నామన్నారు. అన్నదాన భవనానికి పశ్చిమగోదావరి జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రూ.1.50 కోట్లు ఇచ్చారన్నారు. తణుకు, ఆచంట ఎమ్మెల్యేలు ఆరిమిల్లి రాధాకష్ణ, పితాని సత్యనారాయణ, ఆలయ కమిటీ ఛైర్మన్ ముదునూరి వెంకటరాజు, తెదేపా జిల్లా అధ్యక్షుడు గుత్తుల సాయి, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ ఛైర్మన్ రెడ్డి అనంతకుమారి, కూటమి నాయకులు రామకృష్ణ, బండారు శ్రీనివాస్, భాజపా జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ, దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్రమోహన్, దేవస్థానం డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు, పశ్చిమగోదావరి జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీరామరాజు పాల్గొన్నారు.



ఆహారం వండే పాత్రను ప్రారంభిస్తున్న కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, చిత్రంలో ఎమ్మెల్యేలు బండారు సత్యానందరావు, పితాని సత్యనారాయణ, ఆరిమిల్లి రాధాకృష్ణ తదితరులు

పట్టు సాగు.. ఫలితాలు బాగు

● చింతూరు డివిజన్‌లో 2 వేల కుటుంబాలకు ఆర్థిక భరోసా

కూనవరం, న్యూస్‌టుడే: మన్యంలో ప్రకృతి వైపరీత్యాలతో వ్యవసాయ రంగం అతలాకుతలం అవుతున్న నేటి తరుణంలో పట్టు పురుగుల సాగు ఆదివాసీ రైతులకు అండగా నిలుస్తోంది. రూ.లక్షలు పెట్టి చేసిన వ్యవసాయంలో ఏటా నష్టాలే చూస్తున్న కర్షకులను ఈ సాగులో మంచి లాభాలే వరిస్తున్నాయి. ప్రతి కుటుంబం ఏడాదికి నికరంగా రూ.లక్ష వరకు ఆర్జిస్తున్నారు. కేవలం రెక్కల కష్టాన్ని పెట్టుబడిగా పెట్టడంతో ఏటికేడాది సాగు విస్తీర్ణం పెరుగుతుంది. చింతూరు డివిజన్లోని కూనవరం, చింతూరు, వీఆర్‌పురం మండలాల్లో సుమారు రెండు వేల కుటుంబాలు దీనిపై ఆధారపడి తమ జీవన చక్రాన్ని ముందుకు నడిపిస్తున్నారు.

55 రోజుల్లో సాగు..

పట్టు పురుగుల పెంపకం మూడు దశల్లో సాగుతుంది. 55 రోజుల్లో సాగు పూర్తవుతుంది. ఇలా ఏడాదిలో మూడు పంటలు సాగు చేస్తుంటారు. మొదట ప్రభుత్వం సెరికల్చర్ శాఖ నుంచి సాగు చేసే ప్రతి కుటుంబానికి రెండు వందల గ్రాముల గుడ్లను ఉచితంగా ఇస్తారు. వీటిలో సుమారు 20వేల గుడ్లు ఉంటాయి. తొమ్మిది రోజుల్లో ఇవి పిల్లలుగా మారతాయి. పిల్లలుగా మారే సమయంలోనే రైతు వాటిలో మద్ది ఆకుల కొమ్మలను ఉంచుతారు. మూడు రోజుల్లో గుడ్లు అన్నీ పిల్లలుగా మారిపోతాయి. వెంటనే వాటిని సమీప అడవిలో మద్ది చెట్లపైకి వదులుతారు. అక్కడ నెల రోజుల వరకు అవి ఆకులను తింటూ ఎదుగుతాయి. పూర్తిగా ఎదిగిన పురుగులు 40 నుంచి 45 రోజుల మధ్యలో చెట్టు కొమ్మలకు తెల్లని దారంతో అల్లుకుంటాయి. ఇవి చూడడానికి గుడ్డును పోలి ఉంటాయి. వీటినే రైతులు పట్టు కాయలుగా పిలుస్తారు. కాయ గట్టిపడిన వెంటనే వాటిని ఇంటికి తీసుకొచ్చి విక్రయాలకు సిద్ధం చేస్తారు.

కాయకు రూ.మూడు

రైతులు తీసుకున్న గుడ్లలో మొదట 15 వేల వరకు పిల్లలున్నా చివరికి అవి 8వేల నుంచి 12వేల వరకు మాత్రమే మిగులుతాయి. ఆదివాసులు సాగు చేసిన పట్టుకాయలను అధికారులు వేలం ద్వారా వీటిని ఇతర రాష్ట్రాల వారికి విక్రయిస్తారు. ఇందుకు ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మధ్యప్రదేశ్, బీహార్ రాష్ట్రాల నుంచి వస్తుంటారు. వేలంలో వచ్చిన ధరలకనుగుణంగా ఒక్కొక్క కాయకు రూ.మూడు నుంచి రూ.నాలుగు వరకు చెల్లిస్తారు. పంటలోని 12వేల కాయలకు కలిపి రైతుకు రూ.36వేలు వరకు ఆదాయం వస్తుంది. ఇలా ఏడాదిలో మూడు పంటలకు కలిపి రూ.లక్షకు పైగా ఆదాయం సమకూరుతుంది. కూనవరం మండలంలో 20, చింతూరు మండలంలో 14, వీఆర్‌పురం మండలంలో 4 గ్రామాల్లో ప్రస్తుతం ఈసాగు చేపడుతున్నారు.



బండారుగూడెంలో విక్రయానికి సిద్ధంగా ఉన్న పట్టు పురుగుల కాయలు

కూలి వేతనాలు ఇస్తే బాగుంటుంది

సెరికల్చర్ డిపార్టుమెంట్ రైతులకు కూలీ వేతనంగా పంటకు రూ.మూడు వేలు, ఇన్సెంటివ్‌గా కాయకు ఒక రూపాయి ఇస్తారు. సాగు చేసే రైతులు సున్నం, బ్లీచింగ్ ఇతరాలు సమకూర్చుకోవడానికి ఏడాదికి రూ.4500 అదనంగా చెల్లిస్తారు. గత మూడేళ్లుగా కాయల విక్రయాల సొమ్ము తప్ప మిగిలినవి ఇవ్వడం లేదు. రైతులు వెళ్లి అడిగితే బడ్జెట్ లేదని అధికారులు అంటున్నారు. ఇప్పటివరకు రూ.2.15 కోట్లు బకాయిలు ఉన్నాయి. అవికూడా ఇస్తే బాగుంటుంది. - **శ్యామల సరోజిని, మంగళిగూడెం, కూనవరం**

బకాయిలు వాస్తవమే..

రెండేళ్లుగా రైతులకు కూలీ వేతనం, ఇన్సెంటీవ్‌లు, సున్నం, బ్లీచింగ్ సొమ్ములు బకాయిలు ఉన్న మాట వాస్తవమే. ఇందుకు సంబంధించిన బిల్లులు ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి నివేదిస్తున్నాం. నిధులు విడుదల అయిన వెంటనే వారి ఖాతాలకు జమ అవుతాయి.

- **హరికృష్ణ, ఏఎస్‌వో, చింతూరు**

నేడు వెదురు మొక్కల పంపిణీ

రంపచోడవరం: రంపచోడవరం మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో సోమవారం గిరిజన మహిళా రైతులకు వెదురు మొక్కలను పంపిణీ చేస్తామని డీఆర్‌డీఏ పీడీ డాక్టర్ దాసరి రత్నాకరరావు ఆదివారం ప్రకటనలో తెలిపారు. ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే శిరీషాదేవి, రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బొజ్జిరెడ్డి, కలెక్టర్ దినేష్‌కుమార్, జేసీ ప్రశాంత్‌కుమార్ హాజరవుతారన్నారు.



దుకాణాలను వీడని వరద

గోదావరిలో నీటిమట్టం తగ్గుతున్నా బ్యాక్‌వాటర్ (వెనుక జలాలు) కారణంగా గండిపోశమ్మ అమ్మవారి ఆలయం వద్ద దుకాణాలను వరద నీరు వీడటం లేదు. అమ్మవారి ఆలయంతో పాటు భక్తుల క్యాలైన్లు ముంపులోనే ఉన్నాయి. ఇప్పటికే నెలరోజులుగా అమ్మవారి దర్శనాలకు అంతరాయం ఏర్పడింది. అమ్మవారి ఆలయానికి దూరప్రాంతాల నుంచి వస్తున్న భక్తులు కొండపై నుంచి మొక్కులు చెల్లించుకుంటున్నారు. కనీసం వసతులు లేకపోవడంతో వచ్చే భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పోలవరం ముంపులో భాగంగా గత కొన్నేళ్లుగా నూతన ఆలయ నిర్మాణ పనులను చేపడతామని అధికారులు చెబుతున్నా ఆ పనులు నేటికీ ముందుకుసాగని పరిస్థితి నెలకొంది. – న్యూస్‌టుడే, దేవీపట్నం

ఎంత బాధపడిందో ఏమో

కోతులగుట్టలో గురుకుల విద్యార్థిని మృతి ★ ఉపాధ్యాయుల నిర్లక్ష్యమే కారణమంటూ ఆందోళన

కూనవరం, న్యూస్‌టుడే: తలనొప్పి, వాంతులతో ఏడో తరగతి విద్యార్థిని మృతిచెందిన ఘటన కూనవరం మండలం కోతులగుట్టలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. కూనవరం మండలం పల్లూరుకు చెందిన తెల్లం రమేశ్ కుమార్తె జాహ్నవి (13) కోతులగుట్ట గురుకుల పాఠశాలలో చదువుతుంది. శనివారం ఉదయం నిద్రలేచిన జాహ్నవి కొద్ది సేపటి తరువాత నుంచి తలనొప్పి వస్తుందని స్నేహితురాలికి చెప్పింది. తరగతులకు వెళ్లకుండా విశ్రాంతి తీసుకుంది. సమయం రాత్రి తొమ్మిది దాటిన తరువాత తలనొప్పితో పాటు కడుపునొప్పి, వాంతులు రావటంతో ఉపాధ్యాయులు కోతులగుట్ట సామాజిక వైద్య శాలకు తీసుకువెళ్లారు. అక్కడ విద్యార్థినిని పరీక్షించిన సిబ్బంది ప్రాథమిక వైద్యం అందించి పరిశీలనలో ఉండాల్సిందిగా చెప్పారు. కొద్ది సేపటి తరువాత జాహ్నవి పరిస్థితి మెరుగుపడిందంటూ ఉపాధ్యాయులు వైద్యశాల సిబ్బందికి చెప్పి పాఠశాలకు తీసుకువెళ్లారు. అనంతరం ఆదివారం ఉదయం ఆరుగంటల సమయంలో పెద్దగా వాంతులు చేసుకుని పడిపోయింది. వెంటనే వైద్యశాలకు తీసుకువెళ్లగా పరీక్షించిన వైద్యులు జాహ్నవిని అక్కడి నుంచి భద్రాచలం తీసుకెళ్లాలన్నారు. భద్రాచలం వెళ్లే సమయంలోనే జాహ్నవి తల్లిదండ్రులకు సమాచారం అందించి.. వారి వెంట తీసుకువెళ్లారు. అక్కడినుంచి ఖమ్మం తీసుకువెళ్తున్న సమయంలోనే జాహ్నవి మృతిచెందింది.



జాహ్నవి (పాత చిత్రం)

సమాచారం ఎందుకు ఇవ్వలేదు..

జాహ్నవి మృతి పట్ల తండ్రి తెల్లం రమేశ్, బంధువులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుల నిర్లక్ష్యం వల్లే విద్యార్థిని మృతి చెందినట్టు ఆరోపించారు. విద్యార్థిని ఆరోగ్యం సరిగాలేని సమయంలో తల్లిదండ్రులకు ఎందుకు సమాచారం ఇవ్వలేదని ప్రశ్నించారు. మూడు కిలోమీటర్ల దూరంలో జాహ్నవి తల్లిదండ్రులు ఉండగా సమాచారం ఇవ్వడంలో నిర్లక్ష్యం చూపించారని, వైద్యులు పరిశీలనలో ఉంచమన్నా ఉంచకుండా పాఠశాలకు ఎందుకు తీసుకువెళ్లారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

తక్షణ సాయంగా రూ.30వేలు..



తల్లిదండ్రులు, బంధువులతో మాట్లాడుతున్న పీవో శుభం నొక్వాల్

విషయం తెలుసుకున్న చింతూరు ఐటీడీఏ పీవో శుభం నొక్వాల్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతురాలి తల్లిదండ్రులు, బంధువులతో మాట్లాడారు. జాహ్నవి మృతిపై ముగ్గురు సభ్యులతో విచారణ కమిటీ వేస్తామన్నారు. తక్షణ సాయంగా రూ.30వేలు ఇస్తున్నట్టు చెప్పారు. రూ.అయిదు లక్షల పరిహారం కోసం ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. జాహ్నవి కుటుంబంలో ఒకరికి ఉపాధి అవకాశం కల్పిస్తామన్నారు. దీంతో ఆందోళన విరమించారు.

ఉపాధ్యాయులు ఒకలా.. వైద్యులు మరోలా

విద్యార్థిని మృతి విషయంలో పోలీసుల ప్రాథమిక విచారణలో ఉపాధ్యాయులు ఒకలా చెబుతుంటే వైద్యులు మరోలా చెబుతున్నారు. ఉపాధ్యాయులు వైద్యశాలలో సిబ్బంది పరీక్షించి వైద్యం అందించిన తరువాత వారికి చెప్పి.. వెళ్లమన్న తర్వాతనే జాహ్నవిని పాఠశాలకు తీసుకువచ్చామని ఏపీవో విచారణలో చెప్పారు. ★ ప్రాథమిక చికిత్సల తరువాత పరిశీలనలో ఉంచమన్నా ఉంచకుండా తీసుకువెళ్లారని కోతులగుట్ట పీహెచ్‌సీ సూపరింటెండెంట్ మహేశ్‌బాబు తెలిపారు.

సాలీడు.. అద్భుత గూడు



సాలీడు కీటకాల వేట కోసం ఉచ్చును అల్లడంలోనే కాదు.. గుడ్లకు రక్షణ కల్పించేందుకు అద్భుత గూడును కడుతుంది. ఎండ, వాన, శత్రు కీటకాల నుంచి రక్షణ ఉండేలా ఆకులకు కిందభాగంలో ప్రత్యేక గుడ్ల సంచి(గూడు) తయారు చేస్తుంది. ఇతర జీవులు లోపలికి వెళ్లకుండా నోటి నుంచి వచ్చే సన్నని దారంతో దీనిని రూపొందిస్తుంది. తర్వాత అందులో గుడ్లు పెడుతుంది. సుమారు నెలరోజుల్లో వాటి నుంచి పిల్లలు వస్తాయి. కోరింగ అభయారణ్యానికి చెందిన ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ కె.మహేష్ మాట్లాడుతూ ఆ జీవి సుమారు 45 రోజులు ఆ గూడులో సుప్తావస్థలో ఉంటుందన్నారు. గుడ్లు, పిల్లల రక్షణకు ఇది అద్భుత రక్షణ కవచం అన్నారు. ఐ.పోలవరం మండలం రంగాపురం శివారులో మామిడి చెట్టు ఆకుపై కనిపించిన సాలీడు అల్లిన గూడు ఇది.

– న్యూస్‌టుడే, కోనసీమ

కరాటే శిక్షణ.. ఆత్మరక్షణ



గంగవరం, న్యూస్‌టుడే: కరాటే శిక్షణతో ఆత్మరక్షణతో పాటు ఆరోగ్యకరమైన జీవనం సొంతం చేసుకోవచ్చని ఆత్మస్థైర్యం పెరుగుతుందని కరాటే గురువు జి.సూరిబాబు అన్నారు. ఆదివారం పోలవరం జిల్లా గంగవరం ఆశ్రమ బాలికోన్నత పాఠశాలలో హెచ్ఎం సి.హెచ్.సత్యవతి, వార్డెన్ లావణ్య ఆధ్వర్యంలో విద్యార్థినిలకు ఉచిత కరాటే శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కరాటే మాస్టర్లు సూరిబాబు, శివ విద్యార్థినిలకు కరాటేలో ఆత్మరక్షణకు సంబంధించి పలు మెలకువలను నేర్పించారు. ప్రతి ఆదివారం ప్రత్యేక కరాటే శిక్షణ తరగతులను ఉచితంగా అందించడం జరుగుతుందన్నారు. విద్యార్థినిలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

లోవకు భక్తుల తాకిడి



తుని గ్రామీణం, న్యూస్‌టుడే: తలుపులమ్మ లోవ దేవస్థానం ఆదివారం భక్తుల తాకిడితో కిక్కిరిసిపోయింది. భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు. దీంతో దేవస్థానంలోని క్యూలైన్లు, వసతి గదులు నిండిపోయాయి. భక్తులు ఆలయ ప్రాంగణంలోని చెట్లకింద వంటావార్పు చేసుకొని సామూహిక భోజనాలు చేశారు. ఈ ఒక్కరోజే సుమారు 10 వేలకు పైగా భక్తులు అమ్మవారిని దర్శించుకోవడంతో దేవస్థానానికి రూ.5.01 లక్ష ఆదాయం సమకూరినట్లు దేవస్థానం డిప్యూటీ కమిషనర్ విశ్వనాథరాజు తెలిపారు.

సముద్రతీరంలో డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షణ



సూర్యారావుపేట (కాకినాడ): కాకినాడ ఎన్టీఆర్ బీచ్‌లో డ్రోన్ కెమెరాతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తిమ్మాపురం ఎస్సై గణేష్‌కుమార్ తెలిపారు. ఆదివారం సెలవు కావడంతో సముద్రతీర ప్రాంతానికి పర్యాటకులు అధిక సంఖ్యలో వచ్చి ఉల్లాసంగా గడిపారు. ఇటీవల చోటుచేసుకున్న ప్రమాదాలను దృష్టిలో ఉంచుకొని జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్ ఆదేశాల మేరకు తిమ్మాపురం, మెరైన్ పోలీసుల ఆధ్వర్యంలో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా డ్రోన్ కెమెరాలను వినియోగించి పర్యవేక్షించారు.

ఎల్‌నినో వర్రీ..

న్యూస్‌టుడే, ముమ్మిడివరం



ఎం.నంద కిశోర్

ప్రస్తుతం ఖరీఫ్ సాగులో ఎల్ నినో ప్రభావం కనిపిస్తోంది. వర్షాభావ పరిస్థితులు.. అధిక ఉష్ణోగ్రతలు నమోదవు తుండటం.. వంటి పరిస్థితుల్లో వరి పంటలో పలు రకాల పోషక లోపాలు, పురుగులు, తెగుళ్లు బారినపడుతున్నాయి. ఖరీఫ్ సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సస్య రక్షణ చర్యలపై జిల్లా వ్యవసాయ సాంకేతిక సంస్థ (ఏరువాక) కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త, కో ఆర్డినేటర్ డా.ఎం.నందకిశోర్ 'న్యూస్‌టుడే' ముఖాముఖిలో పలు విషయాలను వెల్లడించారు.

పంటలో పొటాష్ లోపం

- జిల్లాలో 1.15 లక్షల ఎకరాల్లో వరినాట్లు పడ్డాయి.
- జులై మొదటి వారంలో వరినాట్లు వేసిన చేలు అంకురం దశకు చేరుకున్నాయి.
- ఆలస్యంగా వరినాట్లు పడిన ప్రాంతాల్లో దుబ్బు చేసే దశలో ఉన్నాయి.
- వర్షాభావ పరిస్థితులు, అధిక ఉష్ణోగ్రతల కారణంగా పంటలో 'పొటాష్' లోపం ఎక్కువగా కనిపిస్తోంది.
- ముదురు ఆకులలో ఇది వస్తుంది. ఆకుల చివరి నుంచి అంచులు లేత గోధుమ రంగుకు మారి క్రమేణా ఆకులు ఎండిపోతాయి.
- దీని నివారణకు లీటరు నీటికి 'మల్టీ కె' 10 గ్రాముల పొడిమందును కలిపి 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి.
- అంకురం దశలో పొటాష్ ఎరువు 20 కిలోలు యూరియాతో పాటు వేసుకోవాలి.

ఎరువుల వినియోగం తగ్గించాలి..

ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావంతో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న తరుణంలో వరి సాగులో ఎరువుల వినియోగం తగ్గించాలి. విచ్చలవిడిగా ఎరువుల వినియోగం వల్ల లాభం కన్నా.. చేటు ఎక్కువగా ఉంటుంది.

చీడపీడల ప్రభావమూ ఎక్కువే..

అధిక ఉష్ణోగ్రతల కారణంగా ఆకునల్లి ఎక్కువగా ఆశిస్తోంది. వర్షాభావ పరిస్థితుల్లో.. ఇవి ఆకు వెనక భాగంలో సమూహాలుగా చేరి రసం పీల్చడం వల్ల ఆకుపైన తెల్లని, పసుపు రంగు మచ్చలు, చారలు ఏర్పడి ఆకులు కాషాయం రంగుకు మారి ఎండిపోతాయి. నివారణకు లీటరు నీటికి గంధకం 3 గ్రాములు, ప్రొఫెనోఫాస్ 2 మిల్లీ లీటర్లు, స్పైరోమెసిఫెన్ 1 మిల్లీలీటరు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. మొండి పురుగు ఆశించడం వల్ల.. మువ్వు ఆకు ఎండిపోయి చనిపోతుంది. నివారణకు దుబ్బు చేసే దశలో కార్బోఫ్యూరాన్ 3-జి గుళికలు 10 కిలోలు లేదా క్లోరిపైరిఫాస్ 2.5 మిల్లీ లీటర్లు, కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 50 శాతం పొడి మందు 2 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. చిరుపొట్ట దశలో కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4-జి గుళికలు 8 కిలోలు, క్లోరంట్రానిలిప్రోల్ 0.4-జి గుళికలు 4 కిలోలు వేయాలి. భవిష్యత్తులో పాముపొడ తెగులు, సుడిదోమ తెగుళ్లు ఆశించే అవకాశం ఉన్నందున గమనించి రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి.



'విలువ.. అదనపు విలువ' పుస్తకావిష్కరణ సభలో మాట్లాడుతున్న అర్థశాస్త్ర ఉపన్యాసకులు భరత్

దేశంలో నిరుద్యోగం.. అప్పుల భారం

అర్థశాస్త్ర ఉపన్యాసకులు భరత్

రామచంద్రపురం: ఉత్పత్తి సామర్థ్యం పెరుగుతున్నా ప్రజల కొనుగోలు శక్తి అదే స్థాయిలో పెరగకపోవడంతో దేశంలో నిరుద్యోగం, అప్పుల భారం, మార్కెట్ సంక్షోభం పెరుగుతున్నాయని అర్థశాస్త్ర ఉపన్యాసకులు పి.భరత్ అన్నారు. ప్రముఖ విశ్లేషకులు రావు కృష్ణారావు రచించిన 'విలువ.. అదనపు విలువ' పుస్తకాన్ని పట్టణంలోని చెలికాని రామారావు స్మారక భవనంలో ఆదివారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. 2008 తర్వాత ప్రపంచవ్యాప్తంగా వచ్చిన పెట్టుబడిదారీ సంక్షోభాలతో మార్క్సిస్ట్ సిద్ధాంతాలను అధ్యయనం చేస్తున్నారని చెప్పారు. కృత్రిమ మేధస్సు (ఏఐ) డిజిటల్ ప్లాట్‌ఫారంలు ఉత్పత్తి రంగాన్ని వేగంగా మారుస్తున్నాయని పేర్కొన్నారు. విలువ.. అదనపు విలువ వంటి మార్క్సిస్టు రాజకీయ, ఆర్థిక శాస్త్ర గ్రంథాల అధ్యయనం ద్వారా విద్యార్థులు, కార్మికులు సమాజంలోని ఆర్థిక సంబంధాలను శాస్త్రీయంగా అర్థం చేసుకోవాలని కోరారు. అనంతరం పుస్తకాన్ని దారిదీపం పత్రిక సంపాదకుడు డి.వి.వి.ఎస్.వర్మకి అంకితమిచ్చారు. డాక్టర్ సి.కృష్ణ మోహనరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు, మేధావులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ పనుల పరిశీలన

రాజమహేంద్రవరం సాంస్కృతికం: రాజమహేంద్రవరం కోటిలింగాలపేట సమీప పందిరి మహాదేవుడు కోటిలింగాల సత్రంలో నిర్మిస్తున్న పిండ ప్రధాన భవన నిర్మాణాన్ని ఆదివారం దేవాదాయశాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్ పరిశీలించారు. పుష్కరాలకు వచ్చే యాత్రికులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని కమిషనర్ సూచించారు. అనంతరం ఆయన నగరంలోని ధార్మిక సంస్థలు, పుష్కరఘాట్ తదితర ప్రాంతాల్లో పర్యటించారని సత్రం సహాయ కమిషనర్ పి.విశ్వనాథరాజు తెలిపారు. ఆర్‌జేసీ వి.త్రినాథరావు, కార్యనిర్వాహక ఇంజినీర్ టి.దుర్గేష్, జిల్లా దేవాదాయశాఖ అధికారి సుబ్బారావు పాల్గొన్నారు.

మహోన్నత వ్యక్తిత్వం కృష్ణబాబు సొంతం

విగ్రహావిష్కరణలో సభాపతి అయ్యన్నపాత్రుడు



కృష్ణబాబు విగ్రహం



విగ్రహావిష్కరణలో సభాపతి అయ్యన్నపాత్రుడు. చిత్రంలో అచ్చిబాబు, మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యేలు కామినేని, ముప్పిడి, తెలంగాణ మంత్రి తుమ్మల, మాజీ ఎంపీ కేవీపీ, ఉపసభాపతి రఘురామకృష్ణరాజు తదితరులు

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: మచ్చలేని మహోన్నత వ్యక్తిత్వం కృష్ణబాబు సొంతమని శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. కొవ్వూరు నియోజకవర్గ కృష్ణబాబు అభిమాన సంఘం ఆధ్వర్యంలో గామన్ వంతెన కూడలిలో మాజీ ఎమ్మెల్యే పెండ్యాల వెంకటకృష్ణారావు (కృష్ణబాబు) విగ్రహాన్ని ఆయన ఆదివారం ఆవిష్కరించారు. దొమ్మేరులో బస్ స్టాండ్ వద్ద ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆంధ్రా సుగర్స్ సీఎండీ పెండ్యాల నరేంద్రనాథ్‌చౌదరి, కృష్ణబాబు విగ్రహాన్ని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆవిష్కరించారు. కైకలూరు శాసనసభ్యుడు కామినేని శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన సంస్మరణ సభలో 'జమిందారు నుంచి జనం మనిషిగా ఎదిగిన ప్రజానేత' పేరిట ముద్రించిన పుస్తకాన్ని అతిథులు ఆవిష్కరించారు. ఉప సభాపతి రఘురామకృష్ణరాజు మాట్లాడుతూ మంచి, మానవత్వానికి కృష్ణబాబు ప్రతిరూపమన్నారు. మాజీ మంత్రి నన్నపనేని రాజకుమారి, మాజీ ఎంపీలు దగ్గుబాటి వెంకటేశ్వరరావు, కేవీపీ రామచంద్రరావు, ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, కాపు కార్పొరేషన్ ఛైర్మన్, మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు మాట్లాడారు. కృష్ణబాబు సోదరుడు, తెదేపా నాయకుడు పెండ్యాల అచ్చిబాబు మాట్లాడుతూ తన అన్న పార్టీలు, కులాలకు అతీతంగా అందరికీ సహాయపడేవారన్నారు. కృష్ణబాబు కుమార్తె అర్చన మాట్లాడుతూ అందరి హృదయాల్లో స్థానం సంపాదించిన మహోన్నత వ్యక్తికి కూతురిగా పుట్టినందుకు గర్వపడుతున్నానని ఉద్వేగానికి లోనయ్యారు. పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, జిల్లా తెదేపా అధ్యక్షుడు బొడ్డు వెంకటరమణచౌదరి, అవంతి సంస్థల అధినేత అల్లూరి ఇంద్రకుమార్, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, బత్తుల బలరామకృష్ణ, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, చింతమనేని ప్రభాకర్, మాజీ మంత్రి పీతల సుజాత, జడ్పీ మాజీ ఛైర్మన్లు ఇమ్మణ్ణి రాజేశ్వరి, ముళ్లపూడి బాపిరాజు, శాసనమండలి మాజీ ఛైర్మన్ షరీఫ్, మాజీ ఎమ్మెల్యేలు బూరుగుపల్లి శేషారావు, టీవీ రామారావు, కృష్ణబాబు అల్లుడు, తెదేపా నాయకుడు ఎస్.రాజీవ్‌కృష్ణ, ద్విసభ్య కమిటీ సభ్యులు కంఠమణి రామకృష్ణ, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, మద్దిపట్ల శివరామకృష్ణ, సూరపనేని చిన్ని, అల్లూరి విక్రమాదిత్య, భాజపా జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, కృష్ణబాబు కుటుంబ సభ్యులు, పారిశ్రామికవేత్తలు, ప్రముఖులు పాల్గొన్నారు.

వెల్లివిరిసిన ఆధ్యాత్మిక శోభ



ఆత్రేయపురం, న్యూస్‌టుడే: కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరస్వామివారి ఆలయం ఆదివారం వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలతో శోభిల్లింది. లక్ష్మీఐశ్వర్య హోమం, గోపూజ, అష్టోత్తర శతనామావళి, కల్యాణం, బాలభోగం, నివేదన తదితర కార్యక్రమాలు కనుల పండువగా జరిగాయి. వేలాది మంది స్వామివారిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. దీంతో ఆలయ పరిసరాలన్నీ గోవింద నామ స్మరణతో ప్రతిధ్వనించాయి. అనంతరం భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. ఆర్టీసీ వివిధ ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులు నడిపింది. ఈవో ఎన్ఎస్ చక్రధరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ర్యాలి జగన్మోహినీ కేశవ స్వామివారి ఆలయానికి కూడా వేలాది మంది భక్తులు తరలివచ్చారు. దేవస్థానం ఛైర్మన్ మెర్ల నాగేశ్వరరావు, ఈవో సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



అష్టోత్తర పూజ నిర్వహిస్తున్న అర్చకుడు, పూజల్లో పాల్గొన్న భక్తజనం

సేవలు ప్రశంసనీయం

కాకినాడ కలెక్టరేట్: సమాచార, పౌరసంబంధాల శాఖలో 39 ఏళ్లకుపైగా వివిధ హోదాల్లో పెద్దింటి రవి అందించిన సేవలు ప్రశంసనీయమని సమాచార, పౌరసంబంధాల శాఖ జోన్-2 ఆర్జేడీ టి.తిమ్మప్ప కొనియాడారు. ఆదివారం స్థానిక టౌన్ రైల్వేస్టేషన్ ఎదురుగా ఉన్న హోటల్ బ్లూమ్‌లో తూర్పుగోదావరి జిల్లా పౌరసంబంధాల అధికారి(డీపీఆర్వో)గా పనిచేస్తూ సోమవారం ఉద్యోగ విరమణ చేయనున్న పెద్దింటి రవికి ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన తిమ్మప్ప మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడంతో పాటు మీడియా సమన్వయంలో రవి చేసిన కృషి స్ఫూర్తిదాయకమన్నారు. తన ఉద్యోగ ప్రస్థానంలో అండగా నిలిచి ఆదరించి ప్రోత్సహించిన ఉన్నతాధికారులకు, ఉద్యోగులకు, మీడియా మిత్రులకు రవి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన సమాచార, పౌరసంబంధాల శాఖ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది రవి దంపతులను సత్కరించారు. సమాచార శాఖ డీడీ బి.పద్మజ, తూర్పుగోదావరి జిల్లా సమాచార, పౌరసంబంధాల అధికారి కె.లక్ష్మీనారాయణ, విశ్రాంత ఉపసంచాలకుడు దాసరి నాగార్జున, సీనియర్ పాత్రికేయుడు టి.మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

40 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

టేకులపల్లి: తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండల పరిధి నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అక్రమంగా రవాణా అవుతున్న 40 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని టేకులపల్లి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై తిరుపతి కథనం ప్రకారం.. టేకులపల్లి పోలీసులు ఆదివారం ఉదయం టేకులపల్లి పెట్రోల్‌బంక్ వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు గ్రామానికి చెందిన మోగిల్ల శివప్రసాద్ ట్రాలీ వాహనాన్ని రహదారి పక్కన అనుమానాస్పదంగా నిలిపి ఉంచడంతో పోలీసులు తనిఖీ చేశారు. అందులో 40 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. శివప్రసాద్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా పాల్వంచకు చెందిన సంపత్‌కుమార్, బోయిన నాగేంద్రబాబు, టేకులపల్లి మండలం కొప్పురాయికి చెందిన కల్యాణ్‌కుమార్ తక్కువ ధరకు ప్రజా పంపిణీ బియ్యం కొనుగోలు చేసి ట్రాలీ వాహనంలో కాకినాడ పంపిస్తున్నట్లుగా వెల్లడైంది. బియ్యం, వాహనాన్ని సీజ్ చేసి శివప్రసాద్‌ను అదుపులోకి తీసుకున్నామన్నారు. పౌరసరఫరాల శాఖ అధికారులకు సమాచారమిచ్చామని ఎస్సై తెలిపారు.

బాటల బాగుకు భరోసా

రూ.873 కోట్లతో మౌలిక వసతుల కల్పన

మండపేట, న్యూస్‌టుడే: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలోని నగరాలు, పట్టణాలు, నగర పంచాయతీల్లో రహదారుల నిర్మాణానికి కూటమి ప్రభుత్వం పెద్దఎత్తున నిధులు కేటాయిస్తోంది. మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయితీల రూపురేఖలను మార్చేందుకు హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హెచ్ఏఎం) విధానంలో భారీ ప్రాజెక్టు చేపట్టింది. నగరాలు, పట్టణాల్లో ప్రాధాన్యతను బట్టి కేటాయించిన నిధులతో సీసీరోడ్లు, బీటీరోడ్ల నిర్మాణంతో పాటు గుంతలమయంగా మారిన ప్రధాన కాలనీల్లో అంతర్గత రహదారుల స్థానంలో పటిష్ఠమైన డబుల్ లేయర్ బీటీరోడ్లు, లోతట్టు ప్రాంతాల్లో నాణ్యమైన రోడ్లు నిర్మించనున్నారు. వర్షాకాలంలో రోడ్లపై నీరునిల్వ ఉండకుండా ప్రధాన అవుట్‌లెట్ డ్రెయిన్లను ఆధునీకికరించనున్నారు. ప్రమాదాలు జరగకుండా కూడళ్ల అభివృద్ధి సెంట్రల్ లైటింగ్, డివైడర్ల అధునికీకరణ, ముఖ్య జంక్షన్ల విస్తరణ, పాదచారులకు కాలిబాటలు నిర్మించనున్నారు.

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని 2 కార్పొరేషన్లు, 9 మున్సిపాలిటీలు, 3 నగర పంచాయితీల్లో ఏళ్ల తరబడి అపరిష్కృతంగా మిగిలిన రోడ్లు, డ్రైనేజీలు, మౌలిక వసతుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు కూటమి ప్రభుత్వం రూ.873 కోట్లు మంజూరు చేసింది. పనులను ప్రముఖ ఇంజినీరింగ్ కన్సల్టెన్సీ ఏజెన్సీలకు అప్పగించింది.



మండపేటలో ప్రతిపాదించిన గొల్లపుంత బైపాస్ రోడ్డు

నిర్మాణ సంస్థలు ఇవే..

ఆయా పనులకు సీఐఎస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఎస్‌జీఎస్ ఇంజినీరింగ్ సర్వీసెస్, ఈసీటీ ఇన్‌ఫ్రా సొల్యూషన్స్, ఎస్ఆర్ కన్సల్టెన్సీ, సత్య అసోసియేషన్ నిర్మాణ సంస్థలుగా వ్యవహరిస్తున్నాయి.

హెచ్ఏఎం ప్రాధాన్యత..

సాధారణంగా కాంట్రాక్టు విధానంలో పనులకు నిధుల కొరత లేదా ఇతర కారణాలతో అలస్యమయ్యే అవకాశం ఉంటుంది. దీనికి భిన్నంగా హెచ్ఏఎం విధానంలో పనుల్లో నాణ్యత, సమయపాలన, నిర్వాహణ బాధ్యతలను నిర్దేశిత ఏజెన్సీలకు అప్పగిస్తారు. ప్రభుత్వం విడతల వారీగా నిధులు విడుదల చేస్తూ నాణ్యత, ప్రమాణాలను క్షేత్రస్థాయిలో నిరంతరం తనిఖీ చేస్తుంది. దీనివల్ల ప్రజాధనం సద్వినియోగంతో పాటు ఏళ్ల తరబడి రోడ్లు, డ్రెయిన్లు పటిష్ఠంగా ఉంటాయి.

పట్టణం/ నగరం	కేటాయించిన నిధులు(రూ.కోట్లలో)
రాజమహేంద్రవరం (కార్పొరేషన్)	300
కాకినాడ (కార్పొరేషన్)	93
పిఠాపురం పట్టణం	200
కొవ్వూరు	50
మండపేట	30
అమలాపురం	25
నిడదవోలు	25
పెద్దాపురం	26
తుని	30
సామర్లకోట	25
రామచంద్రపురం	17
ఏలేశ్వరం నగర పంచాయితీ	20
ముమ్మిడివరం	12
గొల్లప్రోలు	20

టెండర్లు ఖరారయ్యాయి..

అభివృద్ధి పనుల్లో ఆలస్యం చోటుచేసుకోకుండా రాష్ట్ర పురపాలక శాఖ ఏజెన్సీలకు పనులు కేటాయించింది. ఆయా సంస్థలకు పనులు అప్పగించి టెండర్లు ఖరారు చేశారు. నగరాలు, పట్టణాల్లో ప్రతిపాదిత పనులు నెల రోజుల్లో ప్రారంభించే అవకాశం ఉంది.

– శేషగిరి, ఈఈ, ప్రజా ఆరోగ్య శాఖ, రాజమహేంద్రవరం



'ఇస్కాన్' వెలుగులు

రాజమహేంద్రవరం సాంస్కృతికం: రాజమహేంద్రవరం ఇస్కాన్ మందిరంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. గౌతమఘాట్‌లోని మందిరంలో ఆదివారం మంగళహారతి, దర్శన హారతి, భాగవత ప్రవచనం, హయగ్రీవ యజ్ఞం నిర్వహించారు. ఇస్కాన్ అధ్యక్షుడు సత్యగోపీనాథ్‌దాస్ ప్రభుజీ, ప్రతినిధులు హేమ నిమాయిదాస్, రవీంద్రదాస్, శివానంద నిమాయిదాస్ తదితరులు పర్యవేక్షించారు. వేడుకల సందర్భంగా ఇస్కాన్ మందిరం, పరిసర ప్రాంతాలను విద్యుత్తు దీపాలతో అలంకరించారు.

చికిత్స పొందుతూ ఖైదీ మృతి

కంబాలచెరువు(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో జీవిత ఖైదు అనుభవిస్తున్న ఓ వ్యక్తి తీవ్ర అనారోగ్యంతో జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. ఉమ్మడి కృష్ణా జిల్లాలోని కృత్తివెన్ను మండలం ఊర్లగొండిప్ప గ్రామానికి చెందిన జే.ఏసుబాబు(57) ఓ హత్య కేసులో నిందితుడిగా ఉండడంతో కోర్టు జీవిత ఖైదు విధించింది. 2019 అక్టోబరు ఏడో తేదీ నుంచి రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో శిక్ష అనుభవిస్తున్నాడు. హృదయ సంబంధిత అనారోగ్య సమస్యతో బాధపడుతూ మందులు వినియోగిస్తున్నాడు. ఈనెల 25న ఆరోగ్యం క్షీణించడంతో జైలు అధికారులు జీజీహెచ్‌లో చేర్పించారు. 26వ తేదీ నుంచి వెంటిలేటర్‌పై ఉంచి వైద్యులు చికిత్స అందించారు. 29వ తేదీ రాత్రి మృతి చెందాడు. ఈ ఘటనపై ఆసుపత్రి వర్గాల సమాచారం మేరకు ఆదివారం కేసు నమోదు చేశామని మూడో పట్టణ పోలీసులు తెలిపారు.

అట్టడుగు వర్గాల అభ్యున్నతికి దొమ్మేటి కృషి అజరామరం



విగ్రహావిష్కరణలో మంత్రి సుభాష్, ఎమ్మెల్యే గోరంట్ల, ప్రజాప్రతినిధులు

కడియం, న్యూస్‌టుడే: బీసీల అభ్యున్నతికి దొమ్మేటి వెంకటరెడ్డి కృషి చిరస్మరణీయమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, గ్రామీణ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి కొనియాడారు. కడియం మండలం మాధవరాయుడుపాలెం పరిధి గుబ్బలవారిపాలెంలో ఆదివారం ఎమ్మెల్యే గోరంట్లతో కలిసి మంత్రి శెట్టిబలిజ పితామహుడు దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించారు. మంత్రి మాట్లాడుతూ బీసీల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అనుక్షణం కృషి చేస్తోందన్నారు. అందులో భాగంగా చట్టసభల్లో రిజర్వేషన్లు పెంచే ప్రక్రియకు శ్రీకారం చుట్టిందన్నారు. దాంతో వారికి మరిన్ని రాజ్యాంగ స్థానాలు పొందే అవకాశం ఉందన్నారు. ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ శెట్టిబలిజ సంక్షేమానికి అలుపెరుగని పోరాటాలతో ప్రజాహృదయాలను గెలుచుకున్న మహోన్నత వ్యక్తి దొమ్మేటి వెంకటరెడ్డి అని కొనియాడారు. కార్యక్రమానికి చెల్లుబోయిన శ్రీనివాసరావు అధ్యక్షత వహించగా మాజీ కార్పొరేటర్ పాలిక శ్రీను విగ్రహ దాతగా వ్యవహరించారు. డాక్టర్ గోరంట్ల రవిరామ్‌కిరణ్, కోనసీమ జిల్లా పార్టీ అధ్యక్షుడు గుత్తుల సాయి, ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, ఎపీఐఐసీ డైరెక్టర్ మార్గాని సత్యనారాయణ, వెలుగుబంటి రఘురామ్, పితాని శివరామకృష్ణ, సానబోయిన వినోద్, గుత్తుల గోవిందు, కొప్పిశెట్టి నాగేశ్వరరావు, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి	16,000
కురిడీ (వెయ్యింటికి): పాతకాయ: గండేరా	23,500
గటగట	21,000
కొత్తకాయ: గండేరా	23,000
గటగట	20,000
నీటి కాయ (వెయ్యింటికి): పాత (ముక్కుడు) కాయ	19,000-21,000
కొత్త (పచ్చి) కాయ	20,000-21,000
కొబ్బరినూనె మార్కెట్: 15 కిలోలు	5,000
కిలో	350

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.


వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	120-00
రిటైల్ లైవ్	147-00
డ్రెస్డ్	228-00
స్కిన్‌లెస్	257-00

సమగ్ర సంతృప్తికర సేవల దిశగా అడుగులు

'న్యూస్‌టుడే'తో అన్నవరం ఈవో

ముఖాముఖి



అన్నవరం, న్యూస్‌టుడే: అన్నవరం సత్యదేవుని దర్శనానికి వచ్చే భక్తులకు పూర్తి స్థాయిలో సంతృప్తికర సౌకర్యాలు కల్పించేందుకు ప్రణాళిక చేస్తున్నామని ఈవో చక్రధరరావు తెలిపారు. ఇప్పటికే అనేక అభివృద్ధి పనులు చురుగ్గా జరుగుతున్నాయన్నారు. పలు అంశాలపై ఆయన 'న్యూస్‌టుడే'కు వివరించారు. ఆయనేమన్నారంటే..

● ఆధునిక సాంకేతికతతో అందరికీ వసతి : స్వామి దర్శనానికి వచ్చే భక్తులు అందరికీ వసతి కల్పించాలన్నదే లక్ష్యం. ప్రస్తుతం సుమారు 500 గదులు ఉన్నాయి. రద్దీ రోజులు, పర్వదినాలు, పెళ్లిళ్ల సమయంలో సరిపోవడం లేదు. నూతనంగా సీతారామ వసతి సముదాయం నిర్మాణం జరుగుతుంది. సత్యగిరిపై తితిదే సహకారంతో మరో 135 గదుల వసతి సముదాయాన్ని నిర్మించాలని భావిస్తున్నాం. దీనిపై ఇటీవల ధర్మకర్తల మండలిలో తీర్మానం జరిగింది. అనుమతులు వచ్చి నిర్మాణం జరిగితే వసతి ఇబ్బందులు ఉండవు. దళారులకు కళ్లెం వేస్తున్నాం. ఆధార్ సరిపోల్చిన తర్వాతే గది కేటాయిస్తున్నాం. ఈ చర్యలతో ఇటీవల రద్దీ సమయాల్లో సత్ఫలితాలొచ్చాయి. నూతన సాఫ్ట్‌వేర్ ద్వారా మరింత పకడ్బందీగా భక్తులకు వసతి కేటాయింపు పక్కాగా పారదర్శకంగా జరుగుతుంది.

● త్వరలోనే నూతన అన్నదాన భవనం: కేంద్ర పథకం 'ప్రసాద్' ద్వారా పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. అన్నదాన భవనం కొద్ది నెలల్లోనే అందుబాటులోకి రానుంది. ఆధునిక వంటశాల నిర్మాణానికి ప్రణాళిక చేశాం. నాణ్యమైన అన్నప్రసాదాన్ని అందిస్తాం. గోదుమనూక ప్రసాదాన్ని మరింత నాణ్యంగా అందించేందుకు నిత్యం పర్యవేక్షిస్తున్నాం. దుకాణాల్లో అధిక ధరల విక్రయాల నియంత్రణకు పకడ్బందీగా చర్యలు తీసుకున్నాం.

● విస్తృత తనిఖీలతో భక్తులకు భరోసా: భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా భద్రతపై దృష్టిసారించాం. తనిఖీలు విస్తృతం చేశాం. టోల్‌గేటు వద్ద వాహనాలు తనిఖీ చేసిన తర్వాతే కొండపైకి అనుమతిస్తాం. మద్యం సీసాలు ఎవరి వాహనాల్లో అయినా దొరికితే కఠిన చర్యలు ఉంటాయి. మద్యం తాగి వాహనాలు నడిపినట్లు తనిఖీల్లో బయటపడ్డా ఉపేక్షించం. అటువంటి వారికి జరిమానా విధించేలా ప్రణాళిక చేస్తాం.

సంక్షేమ పథకాలే కూటమికి బలం


వీఆర్‌పురంలో కరపత్రాలతో ప్రచారం చేస్తున్న తెదేపా నాయకులు

వరరామచంద్రాపురం, న్యూస్‌టుడే: సంక్షేమ పథకాలే కూటమి ప్రభుత్వానికి బలమని తెదేపా మండల అధ్యక్ష, కార్యదర్శులు బొర్రా నరేశ్, పాయం రామారావు అన్నారు. రామవరంపాడు గ్రామంలో ఆదివారం నిర్వహించిన ఇంటింటి ప్రచారంలో వారు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ప్రజా సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన పథకాలను కరపత్రాలతో చూపించి, లబ్ధిదారులకు ఎలా ఉపయోగపడుతున్నాయో వివరించారు. బీరక ప్రకాశరావు, భాగ్యలక్ష్మి, బాలయ్య, అప్పారావు, బ్రహ్మయ్య, శ్రీరాములు, రాముడు, వెంకటేశ్వర్లు, రంగాచారి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతన్నలకు అండగా సహకార సంఘం


యూరియా ఎరువులను అందిస్తున్న వీఆర్‌పురం కోఆపరేటివ్ అధ్యక్షుడు చంద్రయ్య, తదితరులు

వరరామచంద్రాపురం, న్యూస్‌టుడే: రైతన్నల సాగుకు అవసరమైన ఎరువులను సమయానుకూలంగా, ఇబ్బంది లేకుండా అందించడంలో ఏర్పాటు చేసిన ప్రాథమిక సహకార పరపతి సంఘం అండగా నిలుస్తుంది. గతేడాది యూరియాను దళారులు పక్కదారిలో అధిక ధరలకు అమ్ముకోగా, రైతులు ఇబ్బంది పడ్డారు. దీని నివారణకు కూటమి సర్కార్ వ్యవసాయశాఖ ద్వారా ఆన్‌లైన్ చేసుకుని, ఎరువులు రైతులు పొందేలా ప్రణాళికను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ప్రస్తుతానికి ఈ ప్రణాళికతో కర్షకులు ప్రశాంతంగా తమకు అవసరమైన యూరియా, కాంప్లెక్స్ ఎరువులు తీసుకుంటున్నారు. నెల రోజుల వ్యవధిలో 65 టన్నుల యూరియాను తెప్పించామని, ఇప్పటికే ఆన్‌లైన్ చేసుకున్న దాదాపు 500 మంది రైతులు 1200 బస్తాలపైన తీసుకున్నారని కోఆపరేటివ్ కార్యదర్శి శ్రీను తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన విధంగా బస్తా ధర రూ.267లకు సాగుదారులకు ఇస్తున్నామన్నారు.

అర్హులందరూ ఓటరుగా నమోదుకు చర్యలు


విద్యార్థులకు ఓటరు నమోదు పత్రాలు అందజేస్తున్న జేసీ శ్రీపూజ, బీఎల్‌ఓలు, అధ్యాపకులు

పాడేరు, న్యూస్‌టుడే: పద్దెనిమిదేళ్లు నిండిన యువతీ యువకులందరూ ఓటు హక్కు పొందేందుకు అర్హులు. వారంతా ఓటరుగా నమోదయ్యేందుకు చర్యలు చేపడుతున్నట్లు సంయుక్త కలెక్టర్ శ్రీపూజ చెప్పారు. ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా ఆదివారం పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. డిగ్రీ కళాశాలకు వెళ్లే 18 ఏళ్లు నిండిన విద్యార్థులతో ఓటు హక్కు నమోదుకు దరఖాస్తు చేయించాలని బీఎల్‌వోలను ఆదేశించారు. కొత్తగా ఓటు నమోదుకు ఫారం-6తో పాటు పాస్‌పోర్టు సైజ్ ఫొటో, ఆధార్ కార్డ్/ పదో తరగతి ధ్రువపత్రం జత చేయాల్సి ఉంటుందని విద్యార్థులకు సూచించారు. అనంతరం ప్రజాస్వామ్య వ్యవస్థను పరిరక్షిస్తామని, నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకుంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఎన్నికల డీటీ లక్ష్మణమూర్తి, అధ్యాపకులు అప్పలనాయుడు, ఆర్ఐ నల్లన్న, బీఎల్‌వోలు రవికుమార్, లీలాప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1
రంపచోడవరం 9490877172 అడ్డతీగల 9491575045
దేవీపట్నం 7673936638 గంగవరం 9493541083



సమస్య: మారేడుమిల్లి- వేటుకూరు రహదారిలో పూజారిపాకలు వద్ద ఉన్న కల్వర్టుకు ఇరువైపులా రక్షణ గోడలు లేకపోవడంతో ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారు. చర్యలు చేపట్టాలి.
– పూజారి సుగ్గిరెడ్డి, పూజారిపాకలు

సమాధానం: కల్వర్టుకు రక్షణ గోడలు నిర్మించడానికి చర్యలు చేపడతాం.
– చైతన్య, డీఈఈ, గి.సం.శాఖ, రంపచోడవరం
– న్యూస్‌టుడే, మారేడుమిల్లి

కుస్తీ పోరు.. జాతీయ పతకాల హోరు

వరరామచంద్రాపురం, న్యూస్‌టుడే: మన్యంలోని మారుమూల గ్రామాల్లో ఉన్న పాఠశాలల్లో అరకొర వసతుల నడుమ నేర్చుకున్న నైపుణ్యంతో ముగ్గురు గిరిజన విద్యార్థినులు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటి, పతకాలు కొల్లగొట్టారు. వరరామచంద్రాపురం మండలంలోని మారుమూల సోములగూడెం బాలికల ఆశ్రమ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న వీరు గతేడాది కుస్తీ పోటీల్లో ప్రతిభ కనబరిచి, పతకాలను సొంతం చేసుకున్నారు. వారి విజయాలు గిరిజన యువతకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయి.

తల్లిదండ్రుల ప్రోత్సాహంతో..



దిల్లీ, తమిళనాడులో జరిగిన అండర్-14, 15 జాతీయ స్థాయి కుస్తీ పోటీల్లో మూడుసార్లు పాల్గొన్నాను. 33 కేజీల విభాగంలో ప్రత్యర్థులను ఓడించి పతకాలు సాధించడం ఎంతో ఆనందంగా ఉంది. తల్లిదండ్రులు, పీడీ శివరాజ్‌కుమార్ ప్రోత్సాహంతో ఈ విజయం సాధించా.
– మడకం సురేఖ, అల్లిగూడెం

మరిన్ని విజయాలు సాధిస్తా..



డివిజన్, జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చూపిన తర్వాత జాతీయ స్థాయికి చేరుకోవడం గర్వంగా అనిపించింది. గతేడాది పుదుచ్చేరిలో జరిగిన అండర్- 15, జాతీయ కుస్తీ పోటీల్లో 36 కేజీల విభాగంలో రెండుసార్లు పాల్గొని విజయాలు సాధించాను. ఇంకా కష్టపడి ఉన్నత స్థాయి పోటీల్లో పతకాలు సాధించడమే నా లక్ష్యం. – బంధం సరిత, కుయిగూరు

నిరంతర లక్ష్యసాధనతోనే..



40 కేజీల విభాగంలో, అండర్-17 కుస్తీ పోటీల్లో పాల్గొని జాతీయ స్థాయిలో పతకం సాధించాను. ముంబైలో జరిగిన పోటీల్లో విజేతగా నిలవడం నా జీవితంలో మరిచిపోలేని అనుభవం. ఈ విజయానికి తల్లిదండ్రులు, పీడీ సహకారంతో పాటు, నిరంతర సాధనే ప్రధాన కారణం. – బీరబోయిన శ్రావణి, పెదమట్టపల్లి

విద్యార్థిని మృతికి వైద్యులు, ఉపాధ్యాయులే కారణం

కూనవరం, న్యూస్‌టుడే: కోతులగుట్ట గురుకుల పాఠశాల విద్యార్థిని జాహ్నవి మృతికి ఉపాధ్యాయులు, వైద్యులే కారణమని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను ఆరోపించారు. విద్యార్థిని ఆరోగ్య విషయమై వైద్యులు పూర్తి పరీక్షలు చేయకుండానే తాత్కాలిక వైద్యంతో సరిపెట్టడం, ఉపాధ్యాయులు విద్యార్థిని తల్లిదండ్రులకు సమాచారం అందించకుండా, వైద్యం పూర్తి కాకుండా తీసుకురావడం వల్ల వారి నిర్లక్ష్యాన్ని చూపిస్తుందన్నారు. ఉపాధ్యాయుల విధుల్లోనూ గందరగోళం నెలకొంటుందని, ప్రిన్సిపల్ సెలవులో ఉండడం, ఇన్‌ఛార్జి బాధ్యతలు ఒకరి నుంచి మరొకరు ఇష్టానుసారం తీసుకోవడంలో బాధ్యతారాహిత్యం కనిపిస్తుందన్నారు. ఈ విషయంపై బాలల హక్కుల కమిషన్, మానవ హక్కుల కమిషన్లకు ఫిర్యాదు చేస్తున్నట్లు వివరించారు. విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు.

పరిష్కారంపై ఫీడ్‌బ్యాక్ ఇవ్వండి

పాడేరు, న్యూస్‌టుడే: పీజీఆర్ఎస్ ఫిర్యాదులు పరిష్కారమైన అనంతరం అర్జీదారులు తప్పనిసరిగా ఫీడ్ బ్యాక్ ఇవ్వాలని కలెక్టర్ నిశాంతి కోరారు. ఫిర్యాదుల పరిష్కార నాణ్యతను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం పీజీఆర్ఎస్ ఫీడ్‌బ్యాక్ సిస్టం అందుబాటులోకి తెచ్చిందన్నారు. మొబైల్ ద్వారా ఫీడ్‌బ్యాక్ పోర్టల్ ఓపెన్ చేసి క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి అభిప్రాయాన్ని నమోదు చేయవచ్చన్నారు. దీంతో తదుపరి చర్యలు చేపట్టేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ప్రజలకు మరింత పారదర్శక, జవాబుదారీతనంతో కూడిన పాలన అందించేందుకు అవకాశం కలుగుతుందన్నారు. ఫిర్యాదుదారులు ఫీడ్‌బ్యాక్ అందించి ప్రభుత్వానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఉపాధి పనులపై అవినీతి ఆరోపణలు


వీఆర్‌పురం సంతపాకల చెరువులో ఉపాధి పనుల గోతులు

వరరామచంద్రాపురం, న్యూస్‌టుడే: మండలంలో ఉపాధి హామీ పథకంలో జరుగుతున్న కొన్ని పనులపై అవినీతి ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రధానంగా వీఆర్‌పురం, రేఖపల్లి, రాజుపేట పంచాయతీల్లో జరుగుతున్న పనుల్లో ఎక్కువగా అవినీతి జరుగుతున్నట్లు బహిరంగ విమర్శలు వినిపిస్తున్నాయి. కొన్ని సంఘాలకు మాత్రమే రూ.300 తీసుకుని పనులు చూపుతున్నట్లు, మరికొన్నిచోట్ల పనిచేయకుండా కేవలం నిర్దేశించిన రెండు సమయాల్లో వచ్చి ఫొటోలు దిగి వెళ్లిపోతున్నారని, పనిచేయక పోయినా, వారికి వేతనాలు పడుతున్నాయన్న విమర్శలు ఉన్నాయి. క్షేత్రస్థాయిలో కొందరు సిబ్బంది కొందర్ని ఏర్పాటు చేసుకుని ఫొటోలు చూపించి, ప్రభుత్వ సొమ్ములు కాజేస్తున్నారని బాహాటంగా చెప్తున్నారు. ప్రధానంగా చెరువులు, నీటి గుంతల పనుల్లో ఈ రకంగా అవినీతికి బాటలు వేస్తున్నారన్న ఆరోపణలపై, న్యూస్‌టుడే మండల ఏపీవో రెడ్డిబాబుని వివరణ కోరగా.. ఈ ఆరోపణలు నాదృష్టికి వచ్చాయి. కానీ ఎవరూ ధైర్యంగా ముందుకొచ్చి ఫిర్యాదు చేయడంలేదు. పనుల్లో తేడావస్తే తనిఖీ ఇంజినీరింగ్ అధికారే బాధ్యత వహించాలి. నేను తనిఖీ చేసినచోట పని తక్కువగా ఉందంటే, వెంటనే వారికి పరిస్థితిని వివరించి, చూపించి మస్తరు తగ్గిస్తున్నా అని అన్నారు.

ఉచిత వైద్య శిబిరంలో 170 మందికి సేవలు


రోగికి తీసిన ఎక్స్‌రేను పరిశీలిస్తున్న వైద్యుడు

రంపచోడవరం, న్యూస్‌టుడే: రామకృష్ణమిషన్ ఆధ్వర్యంలో ఆదివారం సిరిగిందలపాడులో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 170మందికి వైద్యపరీక్షలను చేసి మందులను అందజేసినట్టు ట్రస్టు కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనంద మహరాజ్ తెలిపారు. వైద్యులు దాసరి ఉమామహేష్, వెలమ స్నేహామాధురి రోగులకు పరీక్షలు చేసి, మందులు అందించారు. 72 మందికి రక్తపరీక్షలు, 13 మందికి థైరాయిడ్ పరీక్షలు, 17 మందికి ఈసీజీ చేసినట్టు వారు తెలిపారు. రోగులతో పాటు వెంట వచ్చిన వారికి భోజన సదుపాయాన్ని కల్పించారు. కార్యక్రమంలో వైద్యసేవల సమన్వయకర్త కానుమోను శ్రీనివాసు, వాలంటీర్లు గ్రంధి సత్యనారాయణ, వరలక్ష్మి, సత్యకుమార్, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పెంచిన నిత్యావసర ధరలను తగ్గించాలి



రంపయర్రంపాలెంలో నిరసనలో రైతు కూలీ సంఘం నాయకులు

గోకవరం, న్యూస్‌టుడే: పెంచిన నిత్యావసర ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఆం.ప్ర.రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో నిరసన నిర్వహించారు. రంపయర్రంపాలెం గ్రామంలో ఆదివారం చేపట్టిన ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ.. కూలీ పనులు లేక రాష్ట్ర ప్రజలు ఇబ్బందులు పడుతుంటే మరో పక్క ప్రభుత్వాలు నిత్యావసర వస్తువుల ధరలు పెంచి ప్రజల నడ్డి విరుస్తున్నాయన్నారు. పేదలు ఒక పూట తింటే మరో పూట పస్తులు ఉంటున్నారన్నారు. ప్రభుత్వాలు చర్యలు చేపట్టి పెరిగిన నిత్యావసర ధరలను తగ్గించాలన్నారు. జిల్లా సహాయ కార్యదర్శి కె. సతీష్, గోలి ముసలయ్య, చింతపల్లి ముసలయ్య, నరసమ్మ, వీరరాఘవ, లక్ష్మీ, కాసులమ్మ తదితరులు పాల్గొన్నారు.

బాలికల చదువుకు బాసట!

చింతపల్లి, న్యూస్‌టుడే: అల్లూరి జిల్లాలోని చాలామంది బాలికలు పదో తరగతి, ఇంటర్మీడియట్‌తో చదువులు ఆపేస్తున్నారు. ఇంటర్ తరువాత డిగ్రీ, డిప్లొమా, ఉన్నత చదువులు కొనసాగించాలనుకునే విద్యార్థినులకు అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ ఏడాదికి రూ.30 వేల చొప్పున ఉపకారవేతనాన్ని మంజూరు చేస్తోంది. తాము ఎంచుకున్న కోర్సు కాలం పూర్తయ్యేంతవరకూ ఉపకార వేతనం ఏటా మంజూరు అవుతుందని నవనిర్మాణ సమితి ప్రతినిధులు పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో రెగ్యులర్ విద్యార్థులుగా చదివి ఉండాలి. దేశంలో ఎక్కడైనా ఏ ప్రభుత్వ, ప్రైవేటు కళాశాల, విశ్వవిద్యాలయాల్లో 2 నుంచి ఐదేళ్ల కాలపరిమితి కలిగిన కోర్సుల్లో ప్రవేశం పొంది ఉండాలి. మొదటి ఏడాది ప్రవేశానికి సంబంధించిన ధ్రువపత్రాలను సమర్పించాల్సి ఉంటుంది ఆగస్టు 10 నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. మొదటి విడత దరఖాస్తుల స్వీకరణకు సోమవారం వరకే గడువు ఉంది. రెండో విడత 2027 జనవరి 10 నుంచి జనవరి 31 వరకూ దరఖాస్తులు స్వీకరిస్తారు. అభ్యర్థులు వారి ధ్రువపత్రాలు, ఆధార్, బ్యాంకు ఖాతా, పాస్‌ఫొటోలను సమర్పించాలి. వివరాలకు 94407 39892, 94927 85941 నంబర్లలో సంప్రదించాలని నవనిర్మాణ సమితి ప్రతినిధులు తెలిపారు.

ప్రమాదకరంగా విద్యుత్తు స్తంభం




రంపచోడవరం నుంచి దేవీపట్నం వెళ్లే ప్రధాన రహదారిలో బొర్నగూడెం సమీపంలో రోడ్డు పక్కన ఉన్న విద్యుత్తు స్తంభం క్రమంగా ఒరిగిపోతూ ప్రమాదభరితంగా మారింది. దీంతో ఎప్పుడు, ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ఈ రహదారిలో ప్రయాణించే వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఇదే మార్గంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల దాటిన తర్వాత డైట్ కళాశాల, ముసురుమిల్లి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల సమీపంలో విద్యుత్తు స్తంభాలన్నీ ఒరిగి ఉన్నాయి. సంబంధిత అధికారులు స్పందించి ఈ స్తంభాలను సరిచేయించాలని వాహనదారులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, రంపచోడవరం

వంతెన ప్రారంభం ఎప్పుడో?

వీఆర్‌పురం మండలంలోని అన్నవరం వాగుపైన చేపట్టిన గొట్టాల వంతెన పనులు దాదాపుగా పూర్తయ్యాయి. ఆ వాగుపై తాత్కాలికంగా ఏర్పాటు చేసినా రహదారి ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు బురదతో ప్రమాదకరంగా మారింది. ఈ నేపథ్యంలో దీనిపైన ఆర్టీసీ బస్సులు నడపడం నిలిపివేశారు. దీంతో ఇరు గ్రామాల రాకపోకలకు వేరే దారి లేక, ఇంకా అరకొర పనులు చేయాల్సిన వంతెనపై నుంచి ప్రజలు ప్రయాణం సాగిస్తున్నారు. ఇప్పటికైనా పనులు పూర్తిచేసి అధికారికంగా వంతెనను ప్రారంభిస్తే ఆర్టీసీ బస్సులు తిరుగుతాయని గ్రామస్థులు చెబుతున్నారు.
– న్యూస్‌టుడే, వరరామచంద్రాపురం



వసతిగృహంపై పెరుగుతున్న మొక్కలు



గంగవరం ఆశ్రమబాలికోన్నత పాఠశాల ఆవరణలోని వసతిగృహ భవన సముదాయంలో ఓ భవనంపై ప్రమాదకరంగా పెరుగుతున్న మొక్కలను 'న్యూస్‌టుడే' క్లిక్‌మనిపించింది. వాటి వేర్లు గోడలల్లోకి చొచ్చుకుపోవడం వల్ల భవనం నాణ్యత దెబ్బతింటుందని విద్యార్థులు వాపోతున్నారు. ఇప్పటికైనా మొక్కలను తొలగించి భవనం నాణ్యతను కాపాడాలని విద్యార్థులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, గంగవరం

గతుకుల దారి.. అవస్థలే మరి

మారేడుమిల్లి నుంచి వాలమూరు మధ్యలో రహదారి పూర్తిగా శిథిలస్థితికి చేరింది. ఎక్కడికక్కడ గుంతలు, రహదారి కోతలతో ప్రయాణానికి తీవ్ర ఇబ్బందికరంగా మారింది. భారీ వాహనాలు ఆయా గుంతల్లో పడి ప్రమాదాలకు గురవడం, గంటల తరబడి రహదారిపైనే నిలిచిపోయిన సందర్భాలు లేకపోలేదు. ఈ మార్గం మీదుగానే పర్యాటక ప్రాంతాలతో పాటు తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు వాహనాలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారి మరమ్మతులకు చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, మారేడుమిల్లి



తుప్పల మధ్య సూచికబోర్డు



జాతీయ రహదారి విస్తరణలో భాగంగా పలుచోట్ల రహదారి భద్రతా నియమాలు తెలిపేలా హెచ్చరిక, సూచిక బోర్డులను ఉంచారు. రాజవొమ్మంగి శివారు వేంకటేశ్వర థియేటర్‌కు ఎదురుగా మలుపు వద్ద ఆసుపత్రికి వెళ్లే మార్గం చూపుతూ బోర్డును ఏర్పాటుచేశారు. బోర్డు చుట్టూ తుప్పలు పెరిగిపోవడంతో కనిపించడం లేదు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వారు ఇబ్బందిపడుతున్నారు. బోర్డు కనిపించేలా తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, రాజవొమ్మంగి


షాట్‌పుట్‌లో నాగిరెడ్డికి బంగారు పతకం


బంగారు పతకంతో వ్యాయామ ఉపాధ్యాయుడు యస్.నాగిరెడ్డి

ఎటపాక, న్యూస్‌టుడే: నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, ఒలింపిక్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ సంయుక్త ఆధ్వర్యంలో 'స్టేట్ ఆఫ్ సీజన్ మీట్-2026'ను తెలంగాణలో సికింద్రాబాద్ జింఖానా మైదానం వేదికగా ఆదివారం నిర్వహించారు. 35 నుంచి 90 ఏళ్ల వయసు వరకు పురుషులు, మహిళల్లో క్రీడా స్ఫూర్తి, శారీరక దారుఢ్యం తగ్గకూడదనే ఉద్దేశంతో నిర్వహించిన స్పోర్ట్స్ సీజన్ మీట్‌లో ఎటపాక మండలం నల్లకుంట గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న యస్.నాగిరెడ్డి పాల్గొని 45 సంవత్సరాల వయసు విభాగంలో షాట్‌పుట్‌లో రాష్ట్ర స్థాయిలోనే బంగారు పతకం సాధించాడు. ఈ సందర్భంగా తాను పనిచేస్తున్న పాఠశాల ప్రధానోపాధ్యాయులు తాటి సీతారాములు, ఉపాధ్యాయులు అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో వైద్యశిబిరం

గోకవరం, న్యూస్‌టుడే: పూర్వవిద్యార్థుల అసోసియేషన్ ఆధ్వర్యంలో భూపతిపాలెం గురుకుల పాఠశాలలో ఆదివారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. పాఠశాల పూర్వవిద్యార్థి డా.కాటన్‌తో పాటు ఆయన వెంట వచ్చిన ఇతర వైద్యులు విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. పాఠశాలలో ఔషధాలు, ఇంజెక్షన్లను నిల్వ చేసేందుకు వీలుగా రూ.20 వేలు విలువైన రిఫ్రిజిరేటర్‌ను అందజేశారు. విద్యార్థులు ఆడుకునేందుకు రూ.32 వేలు విలువైన క్రీడా సామగ్రిని అందించారు. పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు సృజన్, కార్యదర్శి శ్రీనివాస్, ఇతర సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


శిబిరంలో వైద్యులు, పూర్వవిద్యార్థులు

గ్రామస్థులు ఐక్యంగా ఉండాలి

ప్రత్తిపాడు, (ఏలేశ్వరం): రౌతులపూడి మండలం పారుపాక గ్రామస్థులు వివాదాలకు దూరంగా ఉండాలని తెలుగు మహిళా జాగృతి ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ డా. అనూష యాదవ్ సూచించారు. పెద్దిపాలెంలో ఆదివారం ఆమె మాట్లాడుతూ. . రామాలయ నిర్మాణ అంశంపై పారుపాకలో సామాజిక అశాంతి నెలకొనడం దురదృష్టకరమన్నారు. ఆలయ నిర్మాణ వివాదం ప్రస్తుతం న్యాయస్థానం పరిధిలో ఉందని, తీర్పు వచ్చేంతవరకు యథాతథ స్థితిని కొనసాగించాలన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తత అవసరం

రాజానగరం, న్యూస్‌టుడే: రాజానగరం పోలీసుస్టేషన్ పరిధిలోని బ్రిడ్జికౌంటీలో ఆదివారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సీఐ ఎస్.ప్రసన్న వీరయ్యగౌడ్ ఆధ్వర్యంలో సిబ్బంది చేపట్టారు. కొత్తగా ఎవరైనా ప్రవేశిస్తున్నారా? అనుమానిత కదలికలు ఉంటే తమకు తెలియజేయాలని సీఐ తెలిపారు. సైబర్ మోసాల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలన్నారు. చరవాణి ఉపయోగించడంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

స్వచ్ఛంద సంస్థ ఉదారత

ఎటపాక, న్యూస్‌టుడే: మండలంలోని గౌరిదేవిపేట పంచాయతీ గన్నేరుకొయ్యపాడు గ్రామానికి చెందిన గవ్వల సాయమ్మ అనారోగ్యంతో శనివారం మృతిచెందింది. స్థానిక హోలీస్పిరిట్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు అంత్యక్రియలకు ఆదివారం రూ.6 వేల నగదును ఆర్థిక సాయంగా అందించారు. మృతురాలి భర్త చిన్నప్పుడే చనిపోవటంతో పెద్ద కుమార్తె మరియమ్మ తల్లికి తలకొరివి పెట్టింది. సంస్థ సభ్యులు రోజ్‌కాంత్, శివకుమార్, రవి, రమేష్, ప్రసాద్, సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.


రాజవొమ్మంగిలో కరపత్రాలు పంపిణీ చేసి ప్రచారం చేస్తున్న కేశవ్

పేద ప్రజల అభ్యున్నతికి కృషి

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: పేద ప్రజల అభ్యున్నతే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని తెదేపా మండల క్లస్టర్ ఇన్‌ఛార్జి, సొసైటీ ఛైర్మన్ ముప్పన కేశవ్ అన్నారు. రాజవొమ్మంగి పంచాయతీ శ్రీరామ్‌నగర్‌లో ఆదివారం 'రెండేళ్ల నమ్మకం-అభివృద్ధి సంక్షేమం' కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కేశవ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆధ్వర్యంలో ప్రజలకు అందిస్తున్న పథకాలకు సంపూర్ణ మద్దతు లభిస్తుందన్నారు. అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పరిపాలన సాగుతోందని, రెండేళ్ల పాలనలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులకు ఓటు వేసి, గెలిపించాలని సూచించారు. కో క్లస్టర్ ఇన్‌ఛార్జి బాబ్జీ, యూనిట్ ఇన్‌ఛార్జిలు శ్రీనివాస్, మోహన్ కుమార్ పాల్గొన్నారు.

ఘాట్‌రోడ్డు శిథిలం.. రాకపోకలు అవస్థలమయం


బీటలు వారిన జీఎంవలస ఘాట్‌రోడ్డు

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: మన్యంలోని లోతట్టు గ్రామాలకు వెళ్లే రహదారులు శిథిలస్థితికి చేరడంతో రాకపోకలకు గిరిజనులు నానా అవస్థలు పడుతున్నారు. మారేడుమిల్లి మండలంలో 12 గ్రామ పంచాయతీలు ఉండగా, సుమారు 71 గిరిజన గ్రామాలు ఉన్నాయి. దాదాపు ఈ గ్రామాలన్నీ లోతట్టు ప్రాంతంలోనే ఉన్నాయి. మారేడుమిల్లి నుంచి గుజ్జుమామిడివలస, కుండాడ పంచాయతీల పరిధిలోని గ్రామాలకు వెళ్లాలంటే అటవీ ప్రాంతాల గుండా ఘాట్‌రోడ్డు నుంచి వెళ్లాలి. కుండాడ కూడలి సమీపంలో ఉన్న ఘాట్‌రోడ్డు శిథిలస్థితికి చేరడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళల్లో రాకపోకలకు మరింత కష్టతరంగా ఉంటోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత ప్రభుత్వ శాఖలు స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టాలని గిరిజనులు కోరుతున్నారు.

అంగన్‌వాడీ కేంద్రం.. పశువుల సంచారం


కేంద్ర భవనంలో గేదెలు


పనులు పూర్తిచేయకపోవడంతో నిరుపయోగంగా మారిన అంగన్‌వాడీ కేంద్రం

గోకవరం, న్యూస్‌టుడే: ఏళ్లుగా పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురాకపోవడంతో అంగన్‌వాడీ కేంద్రం పశువులకు నిలయంగా మారింది. గోకవరం మండలం తంటికొండ గ్రామంలో చిన్నారుల కోసం 12 ఏళ్ల కిందట అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులను ప్రారంభించారు. అయితే శ్లాబు వేసి గోడలను నిర్మించి మిగిలిన పనులను పూర్తి చేయకుండా వదిలేశారు. అప్పటినుంచి ఇప్పటి వరకు మిగిలిన పనులను పూర్తి చేయడంలో నిర్లక్ష్యం వహించారు. నిరుపయోగంగా ఉన్న ఈ భవనాన్ని స్థానికులు తమ పశువులు, కోళ్లకు వినియోగించుకుంటున్నారు. ఈ భవనం పూర్తికాకపోవడంతో స్థానికంగా ఉన్న చిన్నపాటి అద్దె ఇంటిలో ఇబ్బందులు పడుతూ అంగన్‌వాడీ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. చిన్నారులు ఆడుకోవాల్సిన అంగన్‌వాడీ కేంద్రం పశువులకు నిలయంగా మారడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దృష్టిసారించి మిగిలిన పనులను పూర్తిచేయించి అంగన్‌వాడీ కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

వేగ నియంత్రికలు కనిపించక ఇక్కట్లు


పోలీస్‌స్టేషన్ వద్ద రహదారిలో కలిసిపోయి ఇలా..

గంగవరం, న్యూస్‌టుడే: స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద ఎన్‌హెచ్ అధికారులు ఏర్పాటు చేసిన వేగ నియంత్రికలు కనిపించేలా చర్యలు తీసుకోవాలని గంగవరం గ్రామస్థులు, పలువురు ప్రయాణికులు కోరుతున్నారు. వేగ నియంత్రికలు రహదారిలో కలిసిపోయి కనిపించకపోవడంతో వాహనాలు అదుపు తప్పి ప్రమాదాల బారిన పడుతున్నామని వాపోయారు. సంబంధిత అధికారులు స్పందించి వాటికి వైట్‌లైన్ మార్కింగ్ చేయించాలని ప్రయాణికులు కోరుతున్నారు.